

గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శ్రీకాంత్

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ టిడిపి కార్యదర్శి బడుగు శ్రీకాంత్ సేవలను గుర్తించి గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బుధవారం పట్టణ టిడిపి అధ్యక్షులు అడబాల కుమార స్వామి, కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు, మాజీ వైస్ ఛైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, భీమేశ్వర ఆలయ ట్రస్ట్ బోర్డ్ మాజీ ఛైర్మన్ కంటే జగదీష్ మోహన్ తదితరులు బడుగు శ్రీకాంత్‌ను అభినందించారు. పార్టీలో శ్రీకాంత్ చేసిన సేవలను గుర్తించి ఈ పదవిని అందించడం తమకు ఆనందకరంగా ఉండన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాతపూడి అరుణ్‌వంశీ, బిసి సామాజిక వర్గానికి చెందిన నాయకులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మోడీ విధానాలపై సమరశంఖం పూరించండి

-26 జరిగే ధర్నాను జయప్రదం చేయాలి
-సదస్సులో కార్మిక, రైతు సంఘాల పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సమరశంఖం పూరించాలని కేంద్ర కార్మిక, రైతు సంఘాల నేతలు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కచేరి పేటలోని టీచర్స్ హోమ్‌లో కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బేకుమల్ల ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మోర్తా రాజశేఖర్ మాట్లాడారు. మోడీ ప్రభుత్వ 10 ఏళ్ల పరిపాలనా కాలంలో రైతుల ఆత్మహత్యలు రెట్టింపు అయ్యాయని, ఉపాధి దొరక్క అసంఘటిత రంగ కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పరిశ్రమల్లో కార్మికులు బానిసల కంటే దారుణమైన పనిపరిస్థితులను ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రతిరోజు ప్రమాదాల్లో పదుల సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం భారత దేశ యువతను పట్టి పీడిస్తుందని ధ్వజమెత్తారు. ఇవేమీ పట్టని ప్రధాని మోడీ తాపీగా అదానీ, అంబానీల సేవలో తరిస్తున్నారని దుయ్యబట్టారు. భారత ప్రజల కష్టాలను గాలికి వదిలేసి హిందూ, ముస్లిం పేరుతో మత రాజకీయాలను పెంచి పోషిస్తూ భారత ప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పరిస్థితులు దీనికి భిన్నంగా లేవని, ఎన్నికల ముందు ప్రజా సమస్యలపై ఉపన్యాసాలు దంచిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఏమాత్రం సంబంధం లేని లడ్డు రాజకీయాలను బలవంతంగా ఆంధ్రా ప్రజలపై రుద్దుతున్నారని అన్నారు. విద్యుత్ ఛార్జీల సర్దుబాటు పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.7 వేల కోట్ల భారాలను వేశారని అన్నారు. ప్రమాదాల సందర్భంగా నష్టపరిహారం ఊసెత్తకుండా కార్మికుల గొంతు నొక్కేందుకు స్మార్ట్ మీటర్లను తెస్తున్నారన్నారు. తక్షణం రైతుల పంటలకు పెట్టుబడిపై 50 శాతాన్ని కలిపి గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, 4 లేబర్ కోడ్లు రద్దుచేయాలని, కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు, పంట రుణాలు, నష్టపరిహారాలు ఇవ్వాలని, ఉపాధి పథకాన్ని 200 రోజులకు పెంచి, రోజు కూలి 600 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 26వ తేదీన దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని, ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ సదస్సుకు స్వాగతం పలుకగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు తాళ్లూరి రాజు, ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి గుబ్బల ఆదినారాయణ, ఎఐసిసిటియు రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యనారాయణ, రైతు కూలి సంఘం జిల్లా నాయకులు సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏరుబండి చంద్రావతి, మధ్యాహ్న భోజన పథక కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల ఈశ్వరి, సిఐటియు వర్కింగ్ కమిటీ సభ్యులు నక్కెళ్ల శ్రీను, కామేశ్వరి, షేక్ పద్మ, పలివెల వీరబాబు, ఎల్‌ఐసి సత్యన్నారాయణ, కళ్ళ నాగేశ్వరరావు, నరసరాజుపాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేష బాబ్జి

గోపిమూర్తిని గెలిపించుకుందాం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్, ఆలమూరు

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తిని గెలిపించాలని కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గొర్ల మాణిక్యం, జాన్ బాబు విజ్ఞప్తి చేశారు. కాకినాడ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ మూర్తిరాజుతోపాటు ఇతర అధ్యా పకులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయ కులు మాణిక్యం మాట్లాడుతూ చట్ట సభల్లో ప్రజలపక్షం వహించే పిడిఎఫ్ ఎంఎల్‌సిలను గెలిపించుకోవలసిన ఆవశ్య కత ఉపాధ్యాయులపై ఎంతైనా ఉందన్నారు. ఈ కార్య క్రమంలో అధ్యాప కులు దుర్గాప్రసాద్, సత్య శ్రీదేవి, కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులోని యుటిఎఫ్ హోమ్‌లో అద్దరి శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రజా సంఘాల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు పాల్గొని మాట్లాడారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపిమూర్తికి మద్దతు ప్రక టించాలని, అధిక మెజార్టీతో గెలిపించడానికి అంద రూ కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్య క్రమంలో జిల్లా కార్యదర్శులు వైవివి.రమణ, పివివిజి ఎస్ఎన్.మూర్తి, రాజు, మండల ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, ఐసిడిఎస్ కో ఆర్డినేటర్ కృష్ణవేణి పాల్గొన్నారు.



కాకినాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విఒఎలు

కాల పరిమితి జిఒ రద్దు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాల పరిమితి జిఒ రద్దు చేయాలని, కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తున్న ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా విఒఎ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.బేబిరాణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగా భవాని, ఈశ్వరిభాయి, కోశాధికారి మేరీ మాట్లాడుతూ 3 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకున్న యానిమేటర్లను తొలగించాలని ఇచ్చిన కాలపరిమితి సర్క్యులర్‌ని తక్షణం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యానిమేటర్లపై రాజకీయ వేధింపులు, తొలగింపులు పెరిగిపోయాయని విమర్శించారు. అక్రమ తొలగింపులు చెల్లవని, తిరిగి తొలగించినవారిని నియమించాలని రాష్ట్ర హైకోర్టు తీర్పును సైతం జిల్లా డిఆర్‌డిఎ అధికారులు అమలు చేయకుండా ధిక్కరిస్తున్నారని అన్నారు. తక్షణం తొలగించినవారిని తిరిగి విధులలోకి తీసుకోవాలని కోరారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుబండి చంద్రవతి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్ల ఈశ్వరి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఒఎ సంఘం సభ్యులు సత్యవేణి, శివ, రాజు, సత్య ఆనంతలక్ష్మి, బుల్లమ్మాయి, దేవి, శ్యామల, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

27వ రోజుకు క్లాప్ డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

బకాయి వేతనాల కోసం క్లాప్ డ్రైవర్లు చేపట్టిన ఆందోళన బుధవారం నాటికి 27వ రోజుకు చేరింది. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో యూనియన్ నాయకులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ క్లాప్ వాహన డ్రైవర్ల సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. 27 రోజుల నుంచి మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. క్లాప్ డ్రైవర్ల బకాయి జీతాలు తక్షణమే చెల్లించకపోతే తమ ఆందోళన అధికారుల ఇళ్ల వద్దకు చేరుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంతోష్, శివశంకర్, రాజు, శివ, రమణ, గంగాధర్, దుర్గబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు దుర్గా ప్రసాద్

టీచర్ పద్మజకు హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ అవార్డు

ప్రజాశక్తి - సామర్లకోట

ఉపాధ్యాయిని యాళ్ల పద్మజ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ 2024 అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె బుధవారం మీడియాతో మాట్లాడుతూ సామాజిక రంగంలో 35 ఏళ్ల అనుభవం ఉన్న హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సంస్థ ఉపాధ్యాయ వృత్తిలో తన సేవలను గుర్తించి అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు నిర్వాహకులు డాక్టర్ బొడ్డపాటి దాసుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డును డిసెంబర్ 10వ తేదీన కాకినాడలో జరిగే అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం రోజున అందుకుంటానని అన్నారు. ఉత్తమ అవార్డుకు ఎంపికైన పద్మజను పలువురు అభినందించారు.



జ్వరం, వాంతులతో బాలిక దుర్మరణం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ పంచాయతీ శివారు సుబ్బంపేటకు చెందిన మైలపల్లి స్వప్న(16) జ్వరం, వాంతులకు గురియై దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. మృతిరాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..గత రెండు రోజుల నుంచి జ్వరం, వాంతులు ఉండడంతో ఉప్పాడలో స్థానికంగా ఉన్న పిఎంపి వైద్యుడు వద్దకు తీసుకువెళ్లగా తాత్కాలిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం హాస్పటల్ తీసుకు వెళ్లాలని సూచించారని తెలిపారు. దీంతో కొత్తపల్లిలో ఉన్న సురక్ష హాస్పిటల్‌కి తరలించగా అక్కడ వైద్యులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లాలని సూచించారని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్తుండగా మార్గం మధ్యలో స్వప్న మృతి చెందింది. కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యులను వివరణ కోరగా జరిగిన సంఘటనపై విచారణ చేపట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - కాకినాడ

అచ్చంపేట నుంచి యాంకర్ ఏజ్ పోర్టు వరకూ జరుగుతున్న హైవే రోడ్డు నిర్మాణ కార్మికులకు చెల్లించాల్సిన బకాయి జీతాలను చెల్లించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ అచ్చంపేట నుంచి యాంకరేజ్ పోర్టు వరకు నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం పనుల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కాంట్రాక్టర్ గత 4 నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదన్నారు. జీతాలు ఇవ్వాలని అడిగితే బెదిరింపులకు పాల్పడటం దారుణమన్నారు. గత రెండు రోజుల నుంచి కార్మికులకు భోజనం పెట్టకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కార్మికులు ఉపాధి కోసం ఇక్కడ పని చేస్తున్నారని, వారికి సకాలంలో చెల్లించాల్సిన జీతాలను చెల్లికపోవడంతోపాటు, వారిని బెదిరింపులకు గురిచేయడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే అధికారులు కలుగజేసుకుని కార్మికులకు జీతాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే జీతాలు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు శ్రీరామమూర్తి, శ్రీనివాస్, నాగేంద్రబాబు, నాయుడు, ఈశ్వర్, రామకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.



జీతాల కోసం ధర్నా చేస్తున్న కార్మికులు


సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

మహిళా సాధికారతపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మహిళా సాధికారతపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ ఎం.వి.భరతలక్ష్మి మహిళా సాధికారత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఇంటరాక్టివ్ ఈవెంట్ విద్యార్థులకు లింగ సమానత్వం, ప్రగతిశీల సమాజాన్ని రూపొందించడంలో మహిళలు కీలక పాత్రపై విలువైన సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, ప్రో. వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఆర్.సునీత, డాక్టర్ యు.రాజ్యలక్ష్మి, డాక్టర్ ఎస్.అరుణకుమారి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రా శబరిమలైలో అన్నదానం

ప్రజాశక్తి - శంఖవరం

మండలంలోని సిద్ధివారి పాలెంలో ఉన్న ఆంధ్ర శబరిమలై వద్ద బుధవారం గురుస్వాములు, దీక్షా పరులకు ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ కుసుమంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రాజమహేంద్రవరం అర్బన్ ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు మాతృమూర్తి, మాజీ మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ బంధుమిత్రులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


అన్నదానం చేస్తున్న మాజీ మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ

23న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - రౌతులపూడి

ఈనెల 23వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ శివరామకృష్ణయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

22న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని పలు ప్రాంతాల్లో 22వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ప్రభాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సామర్లకోట నుంచి వచ్చే 11 కెవి ఫీడర్‌లో విద్యుత్ అంతరాయం కారణంగా కోటపేట, పాత రెవెన్యూ కార్యాలయం, పెద్దబజార్, బలుసులపేట, ఇందిరా కాలనీ, నీలమ్మ చెరువు, కుమ్మరవేది, సంగీత రావు పేట, మెహర్ కంప్లెక్, పోస్ట్ ఆఫీస్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

22న బుచ్చి సీతయ్యమ్మ 189వ వర్ధంతి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి సత్రం వ్యవస్థాపకులు రాజా వత్సవాయి బుచ్చి సీతయ్యమ్మ జగపతి బహదూర్ మహారాణి 189వ వర్ధంతిని ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు సత్రం కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు. మహారాణి సత్రంలో నిర్వహించే ఈ వర్ధంతి సభ సందర్భంగా పేదలకు, అన్నదానం, వస్త్ర దానం నిర్వహిస్తామన్నారు.

108 ఉద్యోగులకు విశ్రాంతి గది ఏర్పాటు



సూపరింటెండెంట్‌ను సత్కరిస్తున్న 108 ఉద్యోగులు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్ 108 వాహన సిబ్బందికి విశ్రాంతి గదిని కేటాయించారు. ఈ గదిని బుధవారం డాక్టర్ సతీష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 108 వాహన సిబ్బంది డాక్టర్ సతీష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను పూలమాలలు, సాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పి.మల్లికార్జునరావు, సాయి, ప్రసాద్, బుజ్జమ్మ, నాగమణి పాల్గొన్నారు.

ఏలేరు నీటిని మెట్ట రైతులకు అందించాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేరు రిజర్వాయర్ నీటిని మెట్ట ప్రాంత సాగుకు అందేలా చర్యలు తీసుకోవాలని రైతు నాయకుడు, స్థానిక కౌన్సిలర్ అలమండ చలమయ్య కోరారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలేరు రిజర్వాయర్ ఏలేశ్వరం మండలం మీదుగా ప్రవహిస్తున్నప్పటికీ మండల రైతులకు ఏ విధంగానూ ఉపయోగం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏలేరు రిజర్వాయర్‌కు లిఫ్ట్ ఏర్పాటు చేసి మెట్ట ప్రాంతాలైన మర్రివీడు, జె.అన్నవరం, తూర్పు లక్ష్మీపురం, గొంటువానిపాలెం గ్రామాల రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. శాసనసభ సమావేశాల్లో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ రిజర్వాయర్ ఆధునీకరణ ఆవశ్యకతపై చర్చించారని, అందులో భాగంగా లిఫ్ట్ ఏర్పాటు చేయించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతులు బోధ చిరంజీవిరావు, కాకాడ నాగేశ్వరరావు, జామి ఆదినారాయణ, కడింశెట్టి వాసు, బెల్లాని శ్రీను పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చలమయ్య

టిడిపికి కార్యకర్తలే బలం

ప్రజాశక్తి - పెదపూడి

టిడిపికి కార్యకర్తలే బలమని టిడిపి మండల అధ్యక్షులు జుత్తుక సూర్యకుమారి అన్నారు. బుధవారం మండలంలోని గండ్రేడు, గొల్లలమామిడాడ, సంపర గ్రామాల్లో ఇంటింటా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.100తో టిడిపి సభ్యత్వం తీసుకుంటే ఐదు లక్షల ప్రమాద బీమా, పిల్లల చదువుకి ఆర్థిక సహాయం, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాల వంటి ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిబిరిశెట్టి గణేష్, పలివేల బుజ్జి, బండారు నాగు, గంట రాజు, భాస్కర్‌రావు, నూనె బుజ్జిపాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ


అంతర్జాతీయ చిల్డ్రన్స్ డే సందర్భంగా స్థానిక పీస్ మేకర్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్‌లో బుధవారం మండల న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చట్టాలపైన, బాలల హక్కులు, పిల్లలు అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పానెల్ న్యాయవాదులు జి.సునీల్‌కాంత్, పి.ఏసుబాబు, బి.లక్ష్మీనారాయణ, శ్రీదేవి పీస్ మేకర్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ కరస్పాండెంట్ జోసఫ్, ప్రిన్సిపల్ ధరణి, స్థానిక నాయకులు బాబురావు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు ఆర్థిక చేయూత

ప్రజాశక్తి - పెద్దాపురం

వీధి వ్యాపారుల ఆర్థిక అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాల ద్వారా చేయూతనిస్తున్నాయని మెప్మా సిఎం ఎం.భ్రమరాంబ అన్నారు. బుధవారం మెప్మా కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. డిసెంబర్ 2 వ తేదీ వరకూ సామాజిక ఆర్థిక ప్రొఫైల్, కేంద్ర సామాజిక భద్రతా పథకాలు ద్వారా వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాల పంపిణీ జరుగుతుందన్నారు. పెద్దాపురం పట్టణ పరిధిలో 2075 మంది వీధి వ్యాపారులు ఉన్నారని, వీరందరికీ వారి వ్యాపార అవసరాల నిమిత్తం రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకూ బ్యాంకులు 7 శాతం వడ్డీ రాయితీతో రుణ సదుపాయం కల్పిస్తాయన్నారు. వీధి వ్యాపారులు డిజిటల్ లావాదేవీలు జరుపుకునేందుకు మొబైల్ యాప్ డౌన్లోడ్ చేయించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వీధి వ్యాపారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్టూ'నిజం'



సిఒపిడి పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీస్ (సిఒపీడీ) పట్ల అప్రమత్తత అవసరమని ప్రముఖ పల్మోనాలజిస్ట్ డాక్టర్ భీమశంకర్ సూచించారు. ప్రపంచ సిఒపీడీ డే సందర్భంగా స్థానిక మెడికవర్ హాస్పటల్‌లో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సిఒపీడీ వ్యాధిని పూర్తిగా నయం చేయలేక పోయినా నివారించవచ్చునని అన్నారు. సిఒపీడీ వ్యాధికి సంబంధించి ఎన్నో చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ జబ్బు ఊపిరితిత్తులకు గాలిని తీసుకువెళ్లే వాయు మార్గాలను ప్రభావితం చేస్తుందన్నారు. తద్వారా కావాల్సినంత ఆక్సిజన్ ఊపిరి తిత్తులకు అందకుండా పోతుందని వివరించారు. దీని కారణంగా శ్వాసనాళాలు తగ్గిపోవటం, రోగి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడడం, దగ్గు, శ్లేష్మం, గురకకు వంటి సమస్యలు ఎదురవుతాయన్నారు. ఈ జబ్బు కారణంగా గుండె సంబంధ వ్యాధులు, గుండె పోటు, ఊపిరితిత్తుల కేన్సర్లతో మరణం సంభవించే ప్రమాదం ఉందన్నారు. సిఒపీడీ వ్యాధి బీడి, సిగరెట్ తాగే వారిలో 90 శాతం వస్తుందన్నారు. వాతావరణ కాలుష్యం వల్ల, పరిశ్రమలు, గనుల్లో పనిచేసేవారికి, దుమ్ముధూళికి గురయ్యే వారికి వస్తుందన్నారు. జనరల్ మెడిసిన్ డాక్టర్ వసంతకుమార్ మాట్లాడుతూ స్మోకింగ్‌కు దూరంగా ఉండటం, దుమ్ము, ధూళి ప్రాంతాల్లో పనిచేసేవారు మాస్క్‌లు ధరించడం ద్వారా ఊపిరితిత్తులకు ఇబ్బంది కలగకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేస్తూ ప్రాణాయామం చేయడం వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీశ్వర రావు, సెంటర్ హెడ్ శుభాకరరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ రామ్, ఆపరేషన్స్ మేనేజర్ ఖాద్రి సిఒపీడీ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మెడికవర్ ఆసుపత్రి వైద్యులు


సదస్సులో మాట్లాడుతున్న ట్రైనర్ ధనలక్ష్మి

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఎంతో మేలు చేస్తాయని కరప సబ్ డివిజన్ మాస్టర్ ట్రైనర్ సంగాడి ధనలక్ష్మి అన్నారు. పి.మల్లవరంలో ఆదర్శ రైతు ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించే బర్మా బ్లాక్, మణిపూర్ బ్లాక్, మైసూర్ మల్లిగా వంటి రకాలు ఉత్పత్తి చేయడం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చునని వివరించారు. స్థానికంగా రైతు వెంకట రమణ పండించిన బర్మా బ్లాక్ పంట కోత ప్రయోగం చేశారు. ఎకరాకు 22 బస్తాలు దిగుబడి రానున్నట్లు గుర్తించారు. ఐసిఆర్‌పిలు బత్రాజు వెంకటలక్ష్మి, వాడపల్లి, రైతులు ఇళ్ల సత్యనారాయణ, ధూళిపూడి శుభ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

1,400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవిడి.అర్జున్ రావు తెలిపారు. మండలంలోని రాయ భూపాలపట్నంలో 800 లీటర్ల బెల్లపు ఊటను, జగ్గంపేట మండలం జె కొత్తూరు గ్రామంలో 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

8 మందికి జైలు..
17 మందికి జరిమానా

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం కోరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 8 మందికి జైలు, 17 మందికి జరిమానా విధించినట్లు ఎస్ఐ. సత్యనారాయణ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 17మందిలో 9 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించామని, జరిమానా చెల్లించని 8 మందికి కాకినాడ రెండవ మెజిస్ట్రేట్ జైలు శిక్ష విధించాని తెలిపారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న మరో 8 మందికి ఒక్కొక్కరికి రూ.300 చొప్పున జరిమానా విధించామని తెలిపారు.

కులం పేరుతో దూషించిన వారిపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక యువతితో గొడవపడి కులం పేరుతో దూషించిన నలుగురుపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇవి. . రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామానికి చెందిన మద్దాల నిరీక్షణ ఆత్రేయపురం గ్రామం కాలువ రేవు సెంటర్లో ఉన్న స్వామి పూతరేకులు షాపులో పనిచేస్తోంది. ఈనెల 5న ఆమె పనిచేస్తున్న సమయంలో పక్క షాపులో ఉన్న చింతా మారియ్య వచ్చి పూతరేకుల వ్యాపారం విషయంలో ఆమెతో గొడవ పెట్టుకుని కులం పేరుతో దూషించాడు. చింతా మారియ్యా కుటుంబ సభ్యులు కూడా ఆమెను కులం పేరుతో దూషించడంతో నిరీక్షణ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్ రాము తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట

గత ప్రభుత్వంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను 2025 మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీ ఎస్‌వివి. సత్యనారాయణ సూచించారు. సామర్లకోట ఇటిసి లే అవుట్‌లో బుధవారం గృహ నిర్మాణ లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్లస్టలాలు కేటాయించి గృహనిర్మాణ పనులు ప్రారంభించి చాలాకాలం అవుతున్న నేపథ్యంలో బ్యాంకు రుణాలు, సబ్సిడీలు పొందాలంటే త్వరితగతిన పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు.

బాలలపై అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ



పురస్కారాలను అందిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

జిల్లాలో బాలల పట్ల అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి హెచ్చరించారు. బుధవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఐసిడిఎస్, విద్య, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం అపురూపమైన దశని, దాన్ని మధురమైన ఘట్టంగా నిలిపేందుకు బాలలకు ప్రత్యేక హక్కులు కల్పించి, వారి రక్షణ కొరకు పోక్సో వంటి కఠినమైన చట్టాలను అమలు చేయడం జరుగుతోందన్నారు. అయినప్పటికీ బాలల పట్ల లైంగిక అకృత్యాలు, హక్కుల హననం కొనసాగడం దురదృష్టకరమని, ఇటువంటి దురాగతాలను అరికట్టవలసిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలల పట్ల జరుగుతున్న అమానుష సంఘటనల పట్ల ఆవేదనతో ఆయన కొద్ది సేపు ఉద్వేగానికి లోనయ్యారు. చైల్డ్ సేఫ్ జిల్లాగా కాకినాడను తీర్చిదిద్దే లక్ష్యంగా జిల్లాలో 6 నెలల పాటు ఉద్యమ కార్యాచరణను అమలు చేపట్టి, చైల్డ్ అబ్యూజ్ నివారణకు గుడ్-బ్యాడ్ టచ్ గురించి, బాలబాలికల్లోను, పిల్లల హక్కులు, రక్షణ, పోక్సో చట్టం పట్ల పెద్దలలోను విస్తత అవగాహన కల్పిస్తున్నామన్నారు. పిల్లల పట్ల ఎవరైనా అనుచితంగాను వ్యవహరిస్తే పోక్సో చట్టం క్రింద కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తమ పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే బాలలు 1098, 112 హెల్ప్ లైన్లకు ఫోన్ చేయవచ్చునని, 7331126044 నెంబరుకు వాట్సాప్ ద్వారా కూడా తెలియజేసి తక్షణ సహాయం పొందవచ్చునన్నారు. అలాగే 112 కంట్రోల్ రూమ్ నెంబరుకు సభికుల నుంచి ఫోన్ చేయించి, అత్యవసర రక్షణ పోలీస్ శాఖ ద్వారా ఎలా పొందవచ్చో లైవ్ డెమో ద్వారా కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల దినోత్సవం పురస్కరించి జిల్లాలో వివిధ అంశాలలో ప్రతిభను చాటిన విద్యార్థినీ విద్యార్థులకు ఆయన ప్రసంశా పురస్కారాలను పంపిణీ చేశారు. అలాగే పిఎం కేర్స్, సిఎం కేర్స్ పథకాల క్రింద సంరక్షణ పొందుతున్న పిల్లలకు బహుమతులును అందజేశారు. బాలల రక్షణకు ఏర్పాటు చేసిన అత్యవసర రక్షణ వ్యవస్థల ఫోన్ నెంబర్లతో ముద్రించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్.భావన, డిఎస్‌పి రఘువీర్ విష్ణు, ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణ, డిఇఒ పి.రమేష్, రాష్ట్ర చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులు టి.ఆదిలక్ష్మి, కార్మిక శాఖ ఎసి ఎం.బుల్లిరాణి, డిఆర్‌డిఎ పీడీ ఎంఎం.జిలానీ, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సిహెచ్.వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాళ్లూరి మఠం ఆస్తిపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - గండేపల్లి

సుమారు 700 సంవత్సరాల చరిత్ర కలిగిన తాళ్లూరు మఠంపై జరుగుతున్న వివాదాన్ని పరిష్కరించే పనిలో పురావస్తు శాఖ అధికారులు ప్రజాభిప్రాయం సేకరించారు. బుధవారం తాళ్లూరు వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌డిఒ శ్రీరమణి ఆధ్వర్యంలో పురావస్తు, దేవాదాయ, రెవెన్యూ అధికారుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో పొడుగు వెంకట సత్యనారాయణ ప్రసాద్ ఆచార్యులు మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి గుడిని అప్పటి జీయర్‌కట్టించడంలో ఎంతో సహకరించారన్నారు. తాళ్లూరు మఠం ప్రసిద్ధి చెందిందని దాని పూర్తి హక్కులు తమ వాళ్ళకే ఉన్నాయంటూ ఆచార్యులు తాళపత్ర గ్రంథాలను చూపించారు. తాళ్లూరును మఠంగా గుర్తిస్తూ అయోధ్య చినజీయర్ స్వామి మఠాల నుంచి తమకు సమాచారం వస్తుందని చెప్పారు. దీనిపై వంశపారపర్య అర్చకులు జేవీ నరసింహ మూర్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మఠం దేవాదాయ శాఖ నుంచి తొలగించి మఠంగా గుర్తించాలని చెప్పారు. ఇది ఒక వ్యక్తిని మఠాధిపతిగా ప్రకటించకుండా ప్రభుత్వ ఆధీనంలోనే సంరక్షించే బాధ్యతలను చేపట్టాలని సూచించారు. ఆచార్యులు చూపిస్తున్న పత్రాలు సరైనవి కాదని, వాటిని ఆచార్యులకి ఇచ్చిన పురావస్తు శాఖ అధికారులపై చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై ఆర్‌డిఒ స్పందిస్తూ మఠానికి చెందిన ఆస్తుల దుర్వినియోగంపై కొన్ని అభియోగాలు వచ్చాయని, వాటిని ప్రజల సమక్షంలో అభిప్రాయాలు సేకరించి నివేదికను తమ ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పా రు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిసి డిఎల్‌వి.రమేష్‌బాబు, పురావస్తు శాఖ డిడి ఒ.రామసుబ్బారెడ్డి, తాళ్లూరు సర్పంచ్ శీలమంతుల వీరబాబు, పురావస్తు శాఖ ఎడి పి.సురేష్ పాల్గొన్నారు.

యనమలను కలిసిన పీతల, బొడ్డు

ప్రజాశక్తి - తొండంగి



మొక్కను అందిస్తున్న సుజాత

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడుని రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి ఛైర్మన్ పీతల సుజాత, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. యనమలకు పుష్పగుచ్చాలు అందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా యనమల ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తించి ముందుకు సాగాలని సూచించారు.

26 లోగా దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11 తరగతులలో ఖాళీల భర్తీకి జరిగే ప్రవేశ పరీక్ష కు ఈనెల 26 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని నవోదయ ప్రిన్సిపల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ వెబ్‌సైట్‌లో ఈనెల 27, 28 తేదీలలో ఉచితంగా దరఖాస్తులో తప్పులను సరిదిద్దుకోవచ్చునని అన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎండోమెంట్ ట్రిబ్యునల్ సభ్యురాలి పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వరాలయంలో ఎపి ఎండోమెంట్ ట్రిబ్యునల్ సభ్యురాలు ముప్వ పద్మ కుటుంబ సమేతంగా బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ ఇఒ బల్ల నీలకంఠం, ఆలయ వేద పండితులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి చిత్రపటం బహూకరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని సిరివాడ, కాండ్రకోట, తిరుపతి, చదలాడ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎంపిడిఒ శ్రీలలిత బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సుధీర్, జెఇ సతీష్‌కుమార్, పంచాయతీరాజ్ ఎఇ శ్రీనివాసరావు, ఆయా గ్రామాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రక్తదానం చేద్దాం ప్రాణదాతలుగా నిలుద్దాం

ప్రజాశక్తి - కాకినాడ



దాతను అభినందిస్తున్న చిరంజీవికుమారి

రక్తదానం చేద్దాం ప్రాణదాతలుగా నిలుద్దామని ఐడియా డిగ్రీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి పిలుపునిచ్చారు. నగరంలోని ఐడియల్ కళాశాల ఆర్ట్స్ అండ్ సైన్సెస్(ఎ) వద్ద ఎన్ఎస్ఎస్ విభాగం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సంయుక్తంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్.పి.చిరంజీవిని కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదానం చేస్తే ఒక పూట ఆకలి తీర్చవచ్చునని, విద్యాదానం చేస్తే జ్ఞానం పంచవచ్చునని, అదే రక్తదానం చేస్తే ప్రాణదాతలుగా నిలవచ్చునని అన్నారు. అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని, అందుకు యువకులు ముందుకు రావాలని పిలుపనిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ వైడి.రామారావు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు సంభవించినప్పుడు క్షతగాత్రులకు వైద్య సేవలు చేసే ఒకే ఒక సంస్థ రెడ్ క్రాస్ అని చెప్పారు. అకాడమిక్ డైరెక్టర్ ఎం.రంజిత్ మాట్లాడుతూ సరైన సమయానికి రక్తదానం చేసేవారు దేవుడి లాంటి వారిని అన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ టి.సత్యనారాయణ మాట్లాడుతూ రక్తదానంతో మరొకరికి జీవితాన్ని ఇచ్చినట్లు అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.స్టీవెన్ రాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వైఆర్ఎల్.చౌదరి, డి విశ్వనాథరాజు, జి మార్తాండం, ఎం.మాచారావు, ఎం.గోపాలకృష్ణ యాదవ్, రెడ్ క్రాస్ సొసైటీ వైద్య సిబ్బంది, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివకోటి అప్పారావు

పారిశుధ్య సిబ్బందిని పెంచండి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణ విస్తరణ, చెత్త వినియోగం దృష్టిలో పెట్టుకుని పారిశుధ్య కార్మికులను పెంచాలని మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో వర్రె గిరిబాబు అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో సంఘ కార్యదర్శి శివకోటి అప్పారావు మాట్లాడుతూ పట్టణ జనాభా, వినియోగం దృష్టిలో పెట్టుకుంటే పారిశుధ్య నిర్వహణకు 250 మంది కార్మికులు ఉండాలన్నారు. కానీ పెద్దాపురం మున్సిపాలిటీలో రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికులు కలిపి 80 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు వారాంతరపు సెలవులు ఇవ్వకుండా పూట సెలవులు ఇస్తున్నారన్నారు. వీరికి వారాంతరపు సెలవులు ఇవ్వాలన్నారు. కార్మిక శాఖ నిబంధనల ప్రకారం క్యాజువల్ లీవులు ఇవ్వటం లేదన్నారు. కార్మికులకు అవసరమైన పనిముట్లు మున్సిపాలిటీ సమకూర్చాలన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు దొండపాటి శేఖర్, వర్రె రమేష్, భవాని, సత్యనారాయణ, మడికి కృష్ణ, రమేష్, దొండపాటి సురేష్, సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సిఐ ఎ.కృష్ణ భగవాన్ అన్నారు. బుధవారం మండలంలోని వికె.రాయపురం జడ్‌పి హైస్కూల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ప్రస్తుతం జరుగుతున్న డిజిటల్ అరెస్టులు, ఈజీ మనీ సంపాదించడం పట్ల యువత ప్రక్కదారి పడుతున్న తీరును ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



హోంమంత్రితో ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్

గవర్నర్, హోంమంత్రితో ఎంఎల్ఎ భేటీ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాస్ నాథన్, హోంమంత్రి నమశ్శివాయం, లోకల్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ పి.జవహర్‌లను ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒఎన్‌జిసి సంస్థ ద్వారా మిగిలిన 231 మత్స్యకారులకు రావలసిన వేట నష్టపరిహారానికి సంబంధించి పూర్తిస్థాయిలో జిఒ విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్మును జమ చేయాలన్నారు. నిజమైన మత్స్యకారులకు లబ్ధి చేకూరడం లేదన్నారు. పేర్లు నమోదు కార్యక్రమంలో అనేక అవకతవకలు జరిగాయన్నారు. దీనిపై సరైన విచారణ చేపట్టాలన్నారు. కొంతమంది ప్రభుత్వ అధికారులు తమ విధులు సరిగ్గా చేయడం లేదన్నారు. కో-ఆపరేటివ్ స్టోర్స్ ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని కోరినట్లు తెలిపారు. ఎంఎల్ఎ నిధులతో కొన్ని అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్లను పిలవడం జరిగిందని, టెండర్లు వేసిన కాంట్రాక్టర్లలో కొంతమంది నిర్లక్ష్యం వహిస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుని, కాంట్రాక్టు లైసెన్స్ రద్దు చేయాలన్నారు. విద్యాశాఖలో పారా టీచర్లను నియమించాలని కోరినట్లు తెలిపారు.

నేటి నుంచి విద్యా - వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - యానాం

ఈనెల 21 నుంచి 23 వరకూ స్థానిక పిఎం రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శన గురువారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని శనివారం సాయంత్రం ఐదు గంటలకు ముగుస్తుందన్నారు. ఈ ప్రదర్శనలో ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు తయారుచేసిన సుమారు 200 పైగా సాంకేతిక అంశాలకు సంబంధించిన ప్రదర్శనలు ఉంటాయన్నారు.

నల్లి పురుగుపై నివారణ చర్యలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జెడి

ప్రత్తి పంటను ఆశించిన పిండి నల్లి నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ జెడి విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని దుర్గాడ గ్రామంలో ప్రత్తిపంట పొలాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫినో పాస్ 3 మిల్లీ లీటర్లు లేదా ఎసిఫేట్ రెండు గ్రాములు చొప్పున పిచికారి చేసిన ప్రత్తి పొలాల్లో పిండి నల్లి అదుపులోనికి వచ్చినట్లు గుర్తించామని అన్నారు. వరిలో ఆర్‌జిఎల్ 2537 వరి రకము కేలీలు వచ్చాయని, వాటిని పరిశీలించేందుకు ఎపి సీడ్ ప్రతినిధులు శుక్రవారం వస్తారని అన్నారు. వాటిని చదరపు మీటరుకు ఎన్ని దుబ్బులు ఉన్నాయి, వాటి సాంద్రత ఏ మేరకు ఉందనేది రైతు సేవ కేంద్రం సిబ్బంది పరిశీలించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.స్వాతి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

జిల్లాలో జరుగుతున్న 57వ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. గత వారం రోజులుగా ఆయా గ్రంథాలయాల్లో విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు ముగింపు కార్యక్రమాల్లో బహుమతులు అందజేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ నగరంలోని గాంధీనగర్ శాకా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగార్జున పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాల మందిరం అధ్యక్షులు అంగర గోపాలకృష్ణ, సంస్కృత భాషా ఉపాధ్యాయులు ఎస్.రాజు, గ్రంథాలయ అధికారి ములంపాక శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే అన్నవరం సత్యవతీ దేవి మహిళా డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సావాల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకను కళాశాల ప్రిన్సిపల్ అనంత లక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ సువర్చల తదితరులు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ఈ వారోత్సవాల్లో విద్యార్థులకు ఈజీ రైటింగ్, ఫాస్ట్ అండ్ ప్రజెంటేషన్, బుక్ ఎగ్జిబిషన్లలో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, పుస్తకాలు బహుమతిగా అందజేశారు. **పెద్దాపురం** స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన ముగింపు సభలో డిఎస్‌పి శ్రీహరిరాజు, ఆర్‌డిఒ శ్రీరమణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, బళ్లముడి సూర్యనారా యణ మూర్తి పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఉదయభాస్కర్ పాల్గొన్నారు. **పెదపూడి** స్థానిక మార్కెట్ సెంటర్ శాఖా గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కె.సత్యనారాయణ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. **సామర్లకోట** స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిని బందిల రత్నామణి అధ్యక్షతన ముగింపు కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య పాల్గొన్నారు. అలాగే పెదబ్రహ్మదేవం శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమానికి గ్రంథాలయ అధికారి పి.మణికుమారి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వై.శ్రీహరి, ఉపాధ్యాయురాలు పి.కవిత పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. **కాజులూరు** స్థానిక శాఖ గ్రంథాలయ అధికారి ఎ.ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఇఒ జాన్, పంచాయతీ సెక్రటరీ ఈశ్వరి, పెద్దలు యాళ్ల వెంకటరమణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎంఇఒ ఇ.ప్రభాకర్ శర్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం జివిఎస్ఆర్‌కె.మూర్తి, గ్రంథాలయం కార్యదర్శి కొండేపూడి శంకర్రావు, బిఎంఆర్ బాలికోన్నత పాఠశాల పీడీ వి.సత్యప్రియ, గ్రంథాలయ అధికారి ఆర్.వెంకటరాము పాల్గొన్నారు. **యు. కొత్తపల్లి** స్థానిక శాఖా గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పైడిరాజు, పంచాయతీ కార్యదర్శి ఎన.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి టి.నళినీప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను కళాశాల అధ్యాపకులు డాక్టర్ వి.కనకరాజు, పలివెల శివాజీ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకుడు కవికొండల సత్యనారాయణ పాల్గొన్నారు. **గొల్లప్రోలు** స్థానిక మలిరెడ్డి సరస్వతి మెమోరియల్ శాఖా గ్రంథాలయంలో సభకు డాక్టర్ ఎంవిఆర్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఛైర్మన్ రెడ్ల శేషగిరి రావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కెవివి.సత్యనారాయణ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కుర్ర నారాయణరావు, మలిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. **కరప** మండలంలోని వేలంగి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ జరిగింది. ఈ కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ వెంకటరంగయ్య, గ్రామ పెద్దలు మెర్ల వీరయ్య చౌదరి, బోండా వెంకన్నరావు, మెర్ల రాధాకృష్ణ, యార్లగడ్డ ప్రభాకర్, కూరపాటి సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి పినిశెట్టి వీరభద్ర, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లమూరి రామారావు, పాల్గొన్నారు.



సామర్లకోటలో విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు



విద్యార్థులతో కాకినాడ సత్యవతిదేవి డిగ్రీ కళాశాల ప్రతినిధులు

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఆదాయం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎన్.మల్లికార్జున అన్నారు. బుధవారం స్థానికంగా సాగులో ఉన్న పామాయిల్ తోటలను ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యానవన శాఖ అధికారి ఎం.శ్రీవల్లి అధ్యక్షతన పామాయిల్ సాగుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ఫెడ్ డివిజనల్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడాన్ని అడ్డుకున్న అధికారులు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామం ఎన్‌టి రాజాపురం వెళ్లే రహదారిలో ప్రయివేట్ లే అవుట్‌లో ప్రభుత్వానికి మినహాయించిన భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని అధికారులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన పలువురు చేసిన ఫిర్యాదుతో పంచాయతీ కార్యదర్శి సత్యరామనాథ్ నిర్మాణం చేపట్టిన ప్రదేశానికి వెళ్లి ఎక్కడ పనులు అక్కడే నిలిపివేయాలని ఆదేశించారు. గతంలో పంచాయతీకి మినహాయించిన స్థలమని ఆ స్థలంలో ప్రభుత్వ కార్యాలయం నిర్మాణానికి సుమారు నాలుగు లక్షల రూపాయలు ఖర్చు పెట్టడం జరిగిందని తెలిపారు.

సత్యనారాయణ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండల టిడిపి అధ్యక్షులు, పి.మల్లవరం సర్పంచ్ దున్నా సత్యనారాయణ సేవలు మరువలేనివని పలువురు అన్నారు. టిడిపి కార్యాలయంలో బుధవారం టిడిపి నాయకుడు కట్టా త్రిమూర్తులు అధ్యక్షతన సత్యనారాయణ సంస్మరణ సభ జరిగింది. ముందుగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కక్ష సాధింపు చర్యలు సరికాదు

ప్రజాశక్తి - పిఠాపురం

వైసిపి సోషల్ మీడియా యాక్టివిష్టులు, ప్రశ్నించే వారిపై కక్ష సాధింపు చర్యలు సరికాదని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ వంగా గీత అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆమె జనసేన కార్యకర్త దాడిలో గాయపడిన వైసిపి కార్యకర్తను దాడి జరిగిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు గడవకముందే ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపు చర్యలు, దాడులకు పాల్పడుతుందన్నారు. వైసిపి సోషల్ మీడియా యాక్టివిస్టులపై అన్యాయంగా కేసులు బనాయించి వేధిస్తున్నారన్నారు. కొద్ది రోజుల క్రితం వైసిపి టీ షర్ట్‌ను వేసుకున్నాడనే నెపంతో దాడి చేసి గాయపర్చిన వారిపై పోలీసులు ఇప్పటి వరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

మున్సిపల్ కళ్యాణ మండపంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక మున్సిపల్ కళ్యాణమండపంలో అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఫైర్ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ... ఫైర్ క్రాకర్స్ నిప్పు రవ్వలు ఎగిరిపడి అగ్ని ప్రమాదం సంభవించినట్టు తెలుస్తుందన్నారు.

బెన్నబాబుకు ఉత్తమ సేవా అవార్డులు

ప్రజాశక్తి - శంఖవరం

విద్యా, వైద్య రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న ఆర్ఎంపి వైద్యులు పదిలం బెన్నబాబు పలు అవార్డులకు ఎంపికయ్యారు. మనికిరెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్ మహాత్మ గాంధీ ఐకాన్ పీస్ అవార్డుతోపాటు, మదర్ థెరిస్సా సోషల్ రిఫార్మర్ అవార్డులకు బెన్నబాబును ఎంపిక చేశారు. ఈ అవార్డులను బుధవారం ఆన్‌లైన్‌లో ప్రధానం చేశారు.